నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 ఖమ్మం, శనివారం 13 ఏప్రిల్ 2024 KHAMMAM



'జై తెలంగాణ' అంటూ నినాదాలు చేస్తున్న మాజీ మంత్రి సత్యవతి, ఎంపీ అభ్యర్థి కవిత, ఎమ్మెల్సీ తాతా మధు

# 'ఆరు గ్యారెంటీ'లను అటకెక్కించారు..

- రైతుబంధు లేదు.. రుణమాఫీ చెయ్యలేదు..
- నాలుగు నెలలైనా రూ. 4వేల పింఛన్ ఊసేలేదు
- ధాన్యానికి బోనస్ రాలే..
- పంటలకు రుణాలివ్వలే..
- హామీల అమలుపై నోరుమెదపని పాలకులు
- 'భద్రాచలం' సన్నాహక సభలో మాజీ మంత్రి సత్యవతి, ఎంపీ కవిత
- బీఆర్ఎస్ తరఫున గెలిచిన 'తెల్లం' ఆత్మపరిశీలన చేసుకోవాలి: తాతా మధు

దుమ్ముగూడెం, ఏప్రిల్ 12: అధికారం చేపట్టిన నాలుగు నెలల్లోనే కాంగ్రెస్ పాలకులు ఆరు గ్యారెంటీలను అటకెక్కించారని రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ విమర్శించారు. ఇప్పటి వరకూ పింఛన్ల జాడ లేదని, రైతుబంధు ఇవ్వలేదని, రుణమాఫీ చెయ్యలేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసకారి అని, కేవలం మోసాలతోనే ఆ పార్టీ అధికారంలోకి వచ్చిందని ధ్వజమెత్తారు. ఆరు గ్యారెంటీల పేరు చెప్పి రాష్ట్ర ప్రజలను ఆ పార్టీ నిలువునా మాయచేసిందని దుయ్యబట్టారు. హామీలను తుంగలో తొక్కి నాలుగు నెలలుగా ఆ పార్టీ చేస్తున్న మోసాలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. దుమ్ముగూడెం మండలం గంగోలు గ్రామంలో శుక్రవారం ఏర్పాటుచేసిన బీఆర్ఎస్ పార్లమెంటు ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు. గత పార్లమెంటు ఎన్నికల్లో ఇక్కడి ప్రజల ఆశీర్వాదంతో లక్ష మెజార్టీతో గెలిచిన మాలోత్ కవితను.. పార్టీ అధినేత కేసీఆర్ ఈసారి కూడా ఎంపీ అభ్యర్థిగా పంపారని వివరించారు. ఈ ఎన్నికల్లోనూ ఆమెను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అలాగే, గత అసెంబ్లీ ఎన్నికలప్పుడు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను, ఆ తరువాత చేసిన మోసాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు.

### పోడు పట్టాల ఘనత కేసీఆర్‌దే..: మాలోతు కవిత

బీఆర్ఎస్ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత మాట్లాడుతూ.. భద్రాద్రి జిల్లా ప్రజలు ఎప్పటికీ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వెంటే ఉంటారని అన్నారు. గత ఎన్నికల్లోనూ తనకు అత్యధిక మెజార్టీ ఇచ్చారని గుర్తుచేశారు. ఇప్పుడు మరోసారి కూడా గెలిపిస్తేనే పార్లమెంట్‌లో ఇక్కడి సమస్యలపై గొంతెత్తి ప్రశ్నించే అవకాశం ఉంటుందని అన్నారు. దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో త్రీఫేజ్ విద్యుత్ లేని విషయాన్ని బండిరేవు గ్రామానికి చెందిన ఆదర్శ రైతు శ్రీనివాసరాజు (వాసురాజు) అప్పట్లో కేసీఆర్‌కు తెలిపారని గుర్తుచేశారు. దీంతో వెంటనే స్పందించిన అప్పటి కేసీఆర్ ప్రభుత్వం తక్షణమే రూ.290 కోట్లు మంజూరు చేసి ఇక్కడ త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యాన్ని కల్పించిందని జ్ఞప్తికి తెచ్చారు. పోడు భూములకు పట్టాలు, వాటికి రైతుబంధు సాయాలు అందించిన ఘనత ముమ్మాటికీ కేసీఆర్‌కే దక్కుతుందని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

### 'తెల్లం' ఆత్మపరిశీలన చేసుకోవాలి: తాతా మధు

ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ.. భద్రాచలం ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన తెల్లం వెంకట్రావు ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవుచెప్పారు. బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్‌లోకి వెళ్లడమంటే నమ్మి ఓట్లేసిన ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు. అలాగే, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కూ బుద్ధి చెప్పాలని ఇక్కడి ప్రజలకు పిలుపునిచ్చారు. డిసెంబర్ 9 తర్వాత రుణమాఫీ చేస్తామని, కొత్త రుణాలు తెచ్చుకోవాలని, ధాన్యానికి బోనస్ ఇస్తామని, రూ.4 వేల పింఛన్లిస్తామని హామీలిచ్చిన ఆ పార్టీ నేతలు.. ఇప్పుడు ఏప్రిల్ 11 దాటినా వాటి ఊసే ఎత్తట్లేదని, హామీలపై నోరు మెదపట్లేదని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ నాయకులు అన్నె సత్యనారాయణమూర్తి, కణితి రాముడు, రేసు లక్ష్మి, జానీ పాషా, వాసురాజు, మానే రామకృష్ణ, రావులపల్లి రాంప్రసాద్, తాండ్ర వెంకటరమణ, సోయం రాజారావు, కోదండరామయ్య, లంకా రాజు, కొత్తూరు సీతారామారావు తదితరులు పాల్గొన్నారు.

# 120 రోజుల్లో కాంగ్రెస్ చేసిందేమీ లేదు



మాట్లాడుతున్న ఎంపీ నామా నాగేశ్వరరావు, పక్కన ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్సీ మధు, మాజీ ఎమ్మెల్యే సండ్ర

- హామీలు నెరవేర్చని ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తున్న ప్రజలు
- తెలంగాణ గళం, వాణి వినిపించేది బీఆర్ఎస్ ఎంపీలే : బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా
- ప్రజలకు గుర్తుకొస్తున్న మాజీ సీఎం కేసీఆర్ : ఎంపీ వద్దిరాజు
- గ్యారెంటీలతో ప్రజలను మభ్యపెట్టారు : ఎమ్మెల్సీ తాతా మధు
- మోసపోతే మళ్లీ గోసే..: మాజీ ఎమ్మెల్యే సండ్ర

పెనుబల్లి, ఏప్రిల్ 12 : ఆరు గ్యారెంటీల పేరిట ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ 120 రోజుల్లో చేసిందేమీ లేదని ఖమ్మం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి, ఎంపీ నామా నాగేశ్వరరావు అన్నారు. పెనుబల్లి మండల బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం సప్తపది ఫంక్షన్ హాలులో శుక్రవారం సాయంత్రం జరిగింది. సమావేశానికి రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో కలిసి ఎంపీ నామా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారని అన్నారు. పార్లమెంటులో రాష్ట్ర ప్రజల వాణి, గళం వినిపించేది బీఆర్ఎస్ పార్టీ ఎంపీలు మాత్రమేనని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం అత్యధికంగా మాట్లాడిన ఘనత బీఆర్ఎస్ పార్టీ ఎంపీదేనని, ఆ అవకాశం కేవలం కేసీఆర్ మాత్రమే కల్పించారన్నారు. కాంగ్రెస్ చేతిలో మోసపోయిన ప్రజలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదని, ఇందుకోసం పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేయించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పదేళ్ల పాలనలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపింది కేసీఆర్ ఒక్కరేనని గుర్తు చేశారు. అలాంటి రాష్ట్రాన్ని గుంపు మేస్త్రీ రేవంత్‌రెడ్డి, తాపీ మేస్త్రీ మోదీ అధోగతి పాలు చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. తెలంగాణను కాపాడుకునేందుకు మరో ఉద్యమంలా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బయటకు వస్తున్నారని, ఆయనకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు.



ఆసన్నమైందన్నారు. దానిని ఎంపీ ఓటు ద్వారా పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ చేసిన అభివృద్ధి, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను గుర్తు చేసి.. ఇటు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాలను వివరిస్తూ ప్రతి ఓటు కారు గుర్తుకు వేయించాలన్నారు. ఖమ్మంలో ఎవరెన్ని చెప్పినా గెలిచేది బీఆర్ఎస్ అభ్యర్థి నామాయేనని అన్నారు.

### ప్రజలకు గుర్తుకొస్తున్న కేసీఆర్ : రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర



పదేళ్లు రాష్ట్రాన్ని పాలించి.. అందరికీ అందుబాటులో ఉన్న కేసీఆర్ నిత్యం ప్రజలకు గుర్తుకొస్తున్నారని అన్నారు. ఆచరణకు నోచుకోని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. రైతాంగాన్ని, పేద ప్రజలను కాపాడుకునేందుకు బీఆర్ఎస్ కార్యకర్తలు కంకణబద్ధులై ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను కాపాడాలని ఆయన పిలుపునిచ్చారు.

### గ్యారెంటీలతో మభ్యపెట్టారు : ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

ఆరు గ్యారెంటీలు.. పది వారెంటీలు అన్నట్లు ప్రజలను మభ్యపెట్టి అధికారం చేపట్టి మొండి చెయ్యి చూపించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని, ఇలాంటి ప్రభుత్వాన్ని తరిమికొట్టే సమయం

### మోసపోతే గోసే.. : సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



గత అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రజలు మరోసారి మోసపోతే మళ్లీ గోస తప్పదన్నారు. 120 రోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎంత వ్యతిరేకత వచ్చిందో అందరికీ తెలిసిందేనన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు అత్యధిక మెజార్టీ తీసుకురావాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఇందుకోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి ఖమ్మం పార్లమెంట్‌లో సత్తుపల్లికి ప్రత్యేక స్థానం కేటాయిద్దామన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కనగాల వెంకట్రావు, ఎంపీపీ లక్కినేని అలేఖ్య, జడ్పీటీసీ చెక్కిలాల మోహన్‌రావు, వైస్ ఎంపీపీ నరుకుళ్ల కస్తూరి, జిల్లా నాయకులు తాళ్లూరి జీవన్‌కుమార్, చిత్తూరు సింహాద్రియాదవ్, లక్కినేని వినీల్, మందడపు అశోక్‌కుమార్, కోటగిరి సుధాకర్‌బాబు, వేముల నరసింహారావు, లగడపాటి శ్రీను, వంగా గిరిజాపతి, అన్ని గ్రామాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

# 'హరితం'.. అగ్నికి హుతం!

- ఖానాపురం-గన్నవరం మధ్య కాలిపోయిన హరితహారం చెట్లు
- వాటి పరిరక్షణకు చర్యలు చేపట్టాలని ప్రజల డిమాండ్



వైరారూరల్, ఏప్రిల్ 12 : గత కేసీఆర్ ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి విడతల వారీగా అమలు చేస్తూ తీరొక్క మొక్కలు నాటింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రోడ్ల వెంట, ఖాళీ ప్రదేశాల్లో, పొలం గట్లపై నాటిన మొక్కలకు పంచాయతీ సిబ్బంది నిరంతరం నీరందించడంతో ఏపుగా పెరిగి చెట్లుగా ఎదిగాయి. పచ్చదనాన్ని సంతరించుకొని నీడనిస్తూ బాటసారులకు కనువిందు చేస్తున్నాయి. ఇంతవరకు బాగానే ఉన్నా.. ప్రస్తుత వేసవిలో వాటి ఆలనా పాలనా చూసేవారు లేకపోవడంతో నీరందక ఎండిపోతున్నాయి. కొన్నిచోట్ల అగ్నికి ఆహుతి అవుతున్నాయి. వైరా మండలం ఖానాపురం-గన్నవరం గ్రామాల మధ్య రోడ్ల పక్కనున్న పొలాల్లోని చెత్తకు ఓ రైతు నిప్పు పెట్టడంతో ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించి హరితహారంలో భాగంగా నాటిన చెట్లు కాలిపోయాయి. ఎదిగిన చెట్లన్నీ వరుసగా కాలిపోయి మోడుగా మారాయి. ప్రస్తుత వేసవి కాలంలో అసలే నీరందక చెట్లు ఎండిపోతుంటే దీనికి తోడు మంటలు అంటుకోవడంతో పచ్చదనమంతా కనుమరుగైంది. మొన్నటి వరకు వేసవి తాపానికి ఆ చెట్ల కిందే సేద తీరిన బాటసారులు, వాహనదారులు కాలిపోయిన చెట్లను చూసి అయ్యో.. అంటూ చలించిపోతున్నారు. సంబంధిత శాఖల అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఇలా జరుగుతున్నదని, హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు, చెట్లను కాపాడే బాధ్యతను పంచాయతీ అధికారులు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



ఖానాపురం-గన్నవరం గ్రామాల మధ్య రోడ్డు పక్కన కాలిపోయిన హరితహారం చెట్లు

# గడువులోగా బియ్యం తరలించాలి

## అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్



మిల్లును తనిఖీ చేసి సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 12 : రైతుల నుంచి సేకరించిన ఖరీఫ్ ధాన్యం నిల్వలను నిర్ణీత గడువులోగా మరాడించి బియ్యంను ఎఫ్‌సీఐకి తరలించాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్ మిల్లర్లను ఆదేశించారు. శుక్రవారం మంగళగూడెంలోని సత్యనారాయణ సిల్కి రైస్ మిల్లును తనిఖీ చేసిన అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడారు. మరాడించిన బియ్యంను భారత ఆహార సంస్థకు చేరవేసే విధంగా మిల్లర్లు జిల్లా యంత్రాంగానికి సహకరించాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యవహరించని మిల్లర్లపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# రామాలయంలో వైభవంగా బ్రహ్మోత్సవాలు



భద్రాచలం, ఏప్రిల్ 12 : వసంతపక్ష ప్రయుక్త శ్రీరామ నవమి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో వైభవంగా సాగుతున్నాయి. శుక్రవారం ఉదయం ప్రాకార మండపంలో ఉత్సవ పెరుమాళ్లకు ప్రత్యేక స్నపన తిరుమంజనం జరిపారు. తర్వాత యాగశాలలో బింబం, కుంభం, మండలం, అగ్నితో చతుఃస్థానార్చన చేపట్టారు. ప్రాకార మండపంలో వేదశాస్త్ర, ఇతిహాస పురాణాదులను వేద పండితులు పఠించారు. శుక్రవారం సందర్భంగా ఉపాలయంలో వేంచేసి ఉన్న లక్ష్మీతాయారమ్మ వారి సన్నిధిలో అమ్మవారికి పంచామృతాభిషేకం, తొమ్మిది రకాల పళ్ల రసాలతో అభిషేకం నిర్వహించారు. అంతరాలయంలోని మూలవరులకు బెంగుళూరుకు చెందిన భక్తులు రూ.5 కోట్లతో తయారు చేయించి సమర్పించిన సర్వాంగ స్వర్ణ కవచాలను ధరింపజేశారు. సాయంత్రం రామయ్య తండ్రికి తాతగుడి సెంటర్ వరకు తిరువీధి సేవ జరిపారు.

### ఉత్సవ ఏర్పాట్ల పురోగతిపై నేడు కలెక్టర్ సమీక్ష

భద్రాచలంలో అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్న శ్రీరామ నవమి, సీతారాముల కల్యాణ ఏర్పాట్ల పురోగతిపై కలెక్టర్ ప్రియాంక ఆల భద్రాచలంలో శనివారం సమీక్షించనున్నారు. స్వామివారి కల్యాణానికి మరో నాలుగు రోజులు మాత్రమే సమయం ఉండడంతో పనుల తీరుపై సమీక్ష చేయనున్నారు. 16న స్వామివారికి ఉత్తర ద్వారం వద్ద ఎదుర్కోలు ఉత్సవం నేత్రపర్వంగా జరుపనున్నారు. 17న మిథిలా ప్రాంగణంలో సీతారాముల కల్యాణం, 18న రామయ్యకు మహా పట్టాభిషేకం మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. సీతారాముల కల్యాణం పూర్తయిన తర్వాత సాయంత్రం భద్రుని మండపంలో పునర్వసు దీక్షలను ప్రారంభిస్తారు.

# స్వార్థానికి వాడుకుంటున్న మావోయిస్టులు

## భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు


చర్ల, ఏప్రిల్ 12 : అమాయక గిరిజనులను మావోయిస్టులు తమ పార్టీలోకి తీసుకొని స్వార్థానికి వాడుకుంటున్నారని, వారిచేత చట్టవ్యతిరేక కార్యకలాపాలు చేయించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. 'ఆపరేషన్ చేయూత'లో భాగంగా చర్ల పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం అజ్ఞాత దళ కుటుంబ సభ్యుల అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంత అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో నిధులు కేటాయిస్తూ వివిధ కార్యక్రమాలు చేపడుతుంటే వాటిని మావోయిస్టులు అడ్డుకోవడం సరికాదన్నారు. తెలిసో తెలియకో కుటుంబాలను వదిలి మావోయిస్టు పార్టీలో చేరిన వారు తిరిగి జనజీవన స్రవంతిలోకి రావాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ఇందుకోసం చేపట్టిన 'ఆపరేషన్ చేయూత' కార్యక్రమానికి మంచి స్పందన వస్తోందని, ఈ క్రమంలోనే చర్ల మండలం బూరుగుపాడుకు చెందిన వంజం దేవా, కాంపెల్లికి చెందిన రాజ్‌కుమార్ అలియాస్ రంజిత్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని జేగురుగొండ మండలం తిమ్మాపూర్‌కు చెందిన సోడి గంగా, సుకుమా జిల్లా డోకుపాడుకు చెందిన కల్మ దేవా.. మవోయిస్టు పార్టీ సిద్ధాంతాలు నచ్చక పోలీసుల ఎదుట లొంగిపోయారని ఎస్పీ వివరించారు. అలాగే ఇటీవల లొంగిపోయిన ఎర్రంపాడుకు చెందిన మడివి కృష్ణ, పూనెం అడమయ్య, వెట్టి భీమాలకు ఎస్పీ రివార్డులు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.సాయిమనోహర్, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, సీఆర్పీఎఫ్ 151 బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ సునీల్‌కుమార్, 141 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ రాజ్‌కుమార్, చర్ల సీఐ రాజ్‌వర్మ, దుమ్ముగూడెం సీఐ అశోక్, ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, రమేశ్, అశోక్‌రెడ్డి, ముత్యం రమేశ్, ఎస్సైలు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు

# పాలేరుకు జలకళొచ్చింది..

- 18.5 అడుగులకు చేరిన రిజర్వాయర్ నీటిమట్టం
- 2,435 గ్రామాల ప్రజల దాహార్తి తీర్చేందుకు వినియోగం



జలకళను సంతరించుకున్న పాలేరు రిజర్వాయర్

కూసుమంచి, ఏప్రిల్ 12 : పాలేరు రిజర్వాయర్‌కు సాగర్ జలాలు రావడంతో వేసవి గండం నుంచి గట్టెక్కినట్లైంది. 23 అడుగుల పూర్తి నీటిమట్టం ఉన్న రిజర్వాయర్ ఎండల తీవ్రత దృష్ట్యా 5.5 అడుగుల అట్టడుగు స్థాయికి చేరిన విషయం విదితమే. ఈ క్రమంలో ఈ నెల ఒకటో తేదీన సాగర్‌లో వదిలిన నీటిని 7వ తేదీన నిలిపివేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సాగర్ డ్యాం నుంచి పాలేరు వరకు 135 కి.మీ దూరం పోలీస్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల గస్తీతో పాటు రిజర్వాయర్ చుట్టూ నిరంతరం నిఘా పెట్టి నీటి చౌర్యం ఎక్కడా జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టారు. దీంతో పాలేరు రిజర్వాయర్‌లో నీరు 18.50 అడుగులకు చేరింది. ఈ నీటిని ఐదు జిల్లాల్లోని 2,435 గ్రామాల ప్రజల దాహార్తి తీర్చేందుకు వినియోగించనున్నారు. అయితే నీటి వాడకం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే మే చివరి నాటికి తాగునీటికి మళ్లీ ఇబ్బదులు తలెత్తే పరిస్థితి ఉంది.

### శుద్ధి చేసిన నీరు సరఫరా..

పాలేరు నుంచి రా వాటర్‌ను తీసుకొని జీళ్లచెరువు వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో శుద్ధి చేసి మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు మాదిరిపురం వద్ద డబ్ల్యూటీపీ ప్లాంట్‌లో నీటిని శుద్ధి చేస్తున్నారు. సూర్యాపేట జిల్లాకు చంద్రుపట్ల వద్ద ప్లాంట్‌లో నీటిని శుద్ధి చేస్తున్నారు. అలాగే ఖమ్మం నగరానికి తాగునీటి కోసం దానవాయిగూడెంకు నీటిని అందిస్తున్నారు.

### రోజుకు 135 క్యూసెక్కుల నీరు

పాలేరు రిజర్వాయర్ నుంచి 135 క్యూసెక్కుల నీటిని మిషన్ భగీరథ కోసం వినియోగిస్తున్నారు. దీంతో రోజుకు 0.20 అడుగుల నీటిమట్టం తగ్గుతుంది. ఇలా వేసవి ముగిసే వరకు సుమారు 60 రోజులపాటు ఇప్పుడున్న నీటిని తాగునీటి అవసరాలకు వినియోగించుకోవచ్చు. ఎక్కడా నీటి ట్యాంపరింగ్ జరగకుండా చర్యలు చేపట్టడంతోపాటు కాల్వపై సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పాలేరులో పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 2.588 టీఎంసీలు కాగా.. ప్రస్తుత నీటి సామర్థ్యం 1.785 టీఎంసీలు ఉన్నాయి.